క్లుప్తంగా

అనుమానితుల సమాచారం ఇవ్వండి


ఆదివాసీ గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

గుండాల: తమ గ్రామంలోకి కొత్తగా అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఆళ్లపల్లి మండలంలోని మూరుమూల గొత్తికోయ గ్రామమైన బూసురాయిలో ఆళ్లపల్లి పోలీసులు 'కమ్యూనిటీ కనెక్ట్' అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతీ ఇంటిని సందర్శించి ఆదివాసీల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేస్తే.. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మావోయిస్టులకు ఎవరైనా సహకరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్, ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ లింక్ లైన్ ప్రారంభం

దమ్మపేట: మండల పరిధిలోని లింగాపల్లి సబ్ స్టేషన్ నుంచి గండుగులపల్లి సబ్ స్టేషన్‌కు నూతన 33 కేవీ ఇంటర్ లింక్ లైన్‌ను, విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) మహేందర్ సోమవారం ప్రారంభించారు. నూతన ఇంటర్ లింక్ లైన్ వలన గండుగులపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ నందయ్య, ఏడీఈ వెంకట రత్నం, నిర్మాణ శాఖ ఏఈ రాజేష్, ఏఈలు రమేష్, రవి పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

దుమ్ముగూడెం: మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొర్స చిలకమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జడ్ వీరభద్రపురం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆ గ్రామాన్ని సందర్శించి సమస్యలపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఉపాధి కూలీలను డబ్బులు చెల్లించాలని, మిషన్ భగీరథ పైపులు వేసి నీరు అందించాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు కొమరం చంటి, సొసైటీ డైరెక్టర్ కొమరంభద్రమ్మ, తిరుపతమ్మ, సర్వేశ్వరరావు, రఘు, చిట్టిబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా అమలు చేస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కోరారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన కె.చెన్నారావు అనే ఖాతాదారుడు కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. రూ.2లక్షల బీమా చెక్కును మృతుడి భార్య రమాదేవికి సోమవారం అందజేశారు. అనంతరం ఆయన ప్రధానమంత్రి జీవనజ్యోతి, పీఎం సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్ ఉపేందర్, జాషువ, బ్యాంక్ సిబ్బంది మురళీకృష్ణ, జగదీష్, అక్షయని పాల్గొన్నారు.

జీఓ 22ను అమలు చేయాలి

మణుగూరురూరల్: మేడే కానుకగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం జీఓ నెంబర్ 22ను గెజిట్ చేసి అమలు చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో కేసీహెచ్‌పీ డీజీఎం మధన్ నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌డి.నాసర్‌పాషా మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా వేతనాల పెంపునకు కార్మికులు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అనంతరం పహల్గాంలో ఉగ్రదాడిలో మరణించిన వారికి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు ఏ.మంగీలాల్, సంజీవరావు, లింగయ్య, వీరభద్రం, లక్ష్మీనారాయణ, నాగేష్, సాంబయ్య, ఆనంద్, చలపతి, కృష్ణ, వెంకన్న, జాన్, సతీష్, నాగేశ్వరరావు, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ మోడల్ పరీక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎప్‌సెట్ మోడల్ పరీక్షను సోమవారం నిర్వహించగా.. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్ బాబు, రమేష్ బాబులు ప్రశ్న పత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో పోటీ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు మోడల్ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గణితం అధ్యాపకుడు ఎండి.బషీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూసుకుంటకు మార్గం సుగమం

- మూడు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి
- చొరవచూపిన మంత్రి తుమ్మల
- నేడు ప్రారంభానికి ఏర్పాట్లు


పూసుకుంట అటవీ మార్గంలో నిర్మాణం పూర్తయిన హై లెవెల్ వంతెన

దమ్మపేట: ఎన్నో ఏళ్లుగా సరైన మార్గం లేక బాహ్య ప్రపంచంతో సరియైన సంబంధాలు లేని మారుమూల ఆదివాసీ పూసుకుంట కొండ రెడ్లకు కష్టాలు తొలిగిపోయాయి. వంతెనల నిర్మాణం వల్ల బాహ్య ప్రపంచంతో మార్గం సుగుమం అయింది. ఈ నిర్మాణాలు మూడు నెలల వ్యవవధిలో పూర్తయ్యేలా చేసి, కొండరెడ్లకు ఇచ్చిన మాటను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిలబెట్టుకున్నారు.

గతమంతా ఇక్కట్లే..

గతంలో పూసుకుంట గ్రామం నుంచి అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలంటే వాగులు, ఇసుక దిబ్బలను దాటుకొని ప్రయాణించాల్సి ఉండేది. వాగులు ప్రవహించే ప్రాంతంలో ఎగుడు దిగుడు గోతులు, ఇసుక వల్ల ద్విచక్ర, తేలికపాటి వాహనాలు ప్రయాణించడానికి చాలా ఇబ్బందికరంగా ఉండేది. ఇక వర్షాకాలంలో అయితే వాగులు ప్రవహిస్తున్న కారణంగా వాహనాల ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలిగేది. ఆ వాగుల్లో వాహనాల ప్రయాణం సాధ్యం కాకపోవడంతో కాలినడకన వాగులు దాటాల్సి వచ్చేది. దీంతో అత్యవసర సమయాల్లో కొండరెడ్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ అటవీ శాఖ అనుమతులు లేక రోడ్డు నిర్మాణం ఆగిపోయింది.

నాడు మంత్రి రాకతో..

పూసుకుంట గ్రామంలో డిసెంబర్ నెలలో పర్యటించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొండరెడ్లతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి జీవనోపాధిని పెంపొందించడానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్‌కు సూచనలు చేశారు. బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు లేనందున.. వాగులు ప్రవహించే ప్రాంతాల్లో సుమారు ఐదు కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో మూడు హై లెవెల్ వంతెనలను మంజూరు చేయించారు. ఈ వంతెనలను మంత్రి తుమ్మల, ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి జనవరి 11న శంకుస్థాపన చేశారు. మూడు నెలల వ్యవధిలోనే వంతెనల నిర్మాణాలను పూర్తి చేయిస్తానని తుమ్మల నాడు హామీ ఇచ్చారు. అన్నట్లుగానే అనతి కాలంలోనే వంతెనల నిర్మాణం పూర్తయింది.

మూడు వంతెనలు..

మండలంలోని అటవీ ప్రాంతమైన పూసుకుంట గ్రామం నుంచి ఆర్లపెంట గండి ముత్యాలమ్మ తల్లి క్రాస్ రోడ్డు వరకు ప్రయాణించడానికి వీలుగా అటవీ మార్గంలో హై లెవెల్ వంతెనలు నిర్మించారు.

మండల పరిధిలోని కొండరెడ్లు నివసించే పూసుకుంట గ్రామం నుంచి ఆర్లపెంట క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లే దట్టమైన అటవీ మార్గంలో రెండు హై లెవెల్ వంతెనలు, కటుకూరు నుంచి రాసన్నగూడెం వైపు వెళ్లే అటవీ మార్గంలో ఒక హై లెవెల్ వంతెన కలిపి మొత్తంగా మూడు వంతెనలు నిర్మించడం పూర్తి చేశారు. దీంతో ఆదివాసీలు ఇతర ప్రాంతాలకు ఇబ్బందులు లేకుండే ప్రయణించేందుకు మార్గం సుగమం అయింది.

నేడు ప్రారంభం..

ఈ వంతెన నిర్మాణాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తదితరులతో కలిసి మంగళవారం (నేడు) ప్రారంభించనున్నారు. కాగా పూసుకుంట నుంచి ఆర్లపెంట క్రాస్ రోడ్డు వరకు అటవీ ప్రాంతంలో నిర్మించాల్సిన బీటీ రోడ్డు నిర్మాణం అనుమతులు లేని కారణంగా అలాగే ఆగిపోయింది.

అనాథాశ్రమం సందర్శన


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో ఓ సంస్థకు చెందిన అనాథ పిల్లల ఆశ్రమాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ సందర్శించారు. ఆశ్రమం పరిసరాలు, రికార్డులు, వంటగది, స్టోర్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి సంరక్షణ, విద్య, ఆహారం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ బాధ్యులతో మాట్లాడి.. పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు గురించి అడిగారు. మెరుగైన సౌకర్యాలను కల్పించి, ఆశ్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, స్థానిక అదనపు ఎస్సై రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వర సర్వే


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని రేగులగండిలో మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం జ్వర సర్వేను నిర్వహించారు. వైద్యసిబ్బంది ప్రతీ గృహాన్ని సందర్శించి అనుమానితుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. మొత్తం 99మందికి పరీక్షలు చేయగా.. ఏ ఒక్కరికీ మలేరియా సోకలేదని వైద్యసిబ్బంది నిర్ధారించారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, శైలజ, ఏపీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఇందిర, ఆశా వర్కర్లు శారద, నీలా పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని అనంతారం సబ్ సెంటర్ పరిధిలోని నర్సాపురం, రామంజవరం గ్రామాల్లో సోమవారం కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజ ఆధ్వర్యంలో జ్వర సర్వే నిర్వహించారు. ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించారు. మలేరియా, డెంగీపై అవగాహన కల్పించారు. మణుగూరు సబ్ యూనిట్ అధికారి ఎస్.వీరస్వామి, హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణారావు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

చంద్రుగొండ: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి రెండు మండలాల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అర్హులందరికీ ఇళ్లస్థలాలతోపాటు ఇందిరమ్మమ ఇళ్లు మంజూరు చేయాలని, అక్రిడేషన్లు ఇవ్వాలని కోరారు. నాయకులు జి.వెంకటేశ్వర్లు, రామిశెట్టి సైదయ్య, ఎస్.సుధాకర్‌రావు, బొగ్గుల శివనాగిరెడ్డి, ఆకుల శివ, కుంజా వెంకటేష్, ఎస్డీ రబ్బాని, తాళ్లూరి రాందాస్, ఎండి.పాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు..

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రుగొండలో అంగన్‌వాడీలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీచర్లకు పెంచిన రూ.18 వేల వేతనాన్ని సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా లలిత, అంగన్‌వాడీ టీచర్లు సరోజ, విజయ, భారతి, వినోద, అరుణ, రమాదేవి, అనిత పాల్గొన్నారు.

సీపీఎం నిరసనల పరంపర


భద్రాచలంఅర్బన్: మురుగు నీటి వద్ద కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పూలమార్కెట్, అంబేడ్కర్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ తెల్లూరి శ్రీనివాసరావులకు వివిధ సమస్యలతో వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, రేపాకుల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, నైనారపు నాగేశ్వరరావు, దాముళ్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

అర్హులకే ఇళ్లు ఇవ్వాలని ధర్నా

చంద్రుగొండ: ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో రాజకీయ జోక్యం లేకుండా, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌కు అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెద్దిని వేణు, నాయకులు బలూరి రామిరెడ్డి, గాలి రామారావు, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాజా, కాంతారావు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు తొలగించాలని..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో డ్రెయినేజీ పూడిక తీయించాలని, కొత్త డ్రెయినేజీలు నిర్మించాలని సీపీఎం 20వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో మురుగు నీటి వద్ద కూర్చుని సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గద్దం స్వామి మాట్లాడారు. పట్టణ కమిటీ సభ్యుడు నాదెళ్ల లీలావతి, డి.కనక శ్రీ, శాఖ కార్యదర్శి కాకా రమణ సభ్యులు మంగమ్మ, చుక్కమ్మ, రాధా పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మోహన్‌రెడ్డి సోయవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుమ్ముగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లకు కొత్త బ్రేకర్లు అమర్చనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు వెల్లడించారు.

మణుగూరు తహసీల్దార్‌గా ఇమ్మానుయేల్



మణుగూరుటౌన్: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాఘవరెడ్డి ఆళ్లపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుండాలలో పనిస్తున్న ఎం.ఇమ్మానుయేల్ సోమవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

గుండాల ఎస్సైగా రహూఫ్



గుండాల: గుండాల నూతన ఎస్సైగా ఎస్‌కె.సైదా రహూఫ్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై రాజమౌళి కొత్తగూడెం వీఆర్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో అశ్వాపురం నుంచి సైదా రహూఫ్ బదిలీ అయ్యారు.

మేడే పోస్టర్ల విడుదల

గుండాల: మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ అనుబంధ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు యాసారపు వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం మేడేను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మేడే సందర్భంగా హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాటి కృష్ణ, గడ్డం నగేష్, వానపాకుల చిరంజీవి, ఉపేందర్, సమ్మయ్య, శ్రావన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని కట్టుగూడెం గ్రామంలో సోమవారం భాగ్యశ్రీ మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఏపీఓం మీరాబి, సీసీ నిర్మల, వీఓఏలు కాంత కుమారి, పుల్లయ్య, ఎస్‌కె.నసీమా, రైతులు పాల్గొన్నారు.

మే 20న సార్వత్రిక సమ్మె

ములకలపల్లి: కేంద్ర లేబర్ కోడ్‌లకు నిరసనగా మే 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘ జనరల్‌బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సంఘ మండల కన్వీనర్ నిమ్మల మధు, ఎస్‌కె.మస్తాన్, తేజావత్ క్రాంతి, ఇరపా నాగమణి, కీసరి సుజాత, మంగమ్మ, జయ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరం..



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

అశ్వారావుపేటరూరల్: జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై యయాతి రాజు అన్నారు. సోమవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన, ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక రింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టి.శ్రావణ్ కుమార్, ఏఎస్సైలు, పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమార్కులపై చర్యలేవి?

చర్ల: దానవాయిపేట నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం దానవాయిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

దానవాయిపేట నుంచి ఆక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న లారీలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని మూడు రోజులు కావస్తున్నప్పటికీ.. ఇంత వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆరోపించారు. సమావేశంలో ఆదివాసీ యుజన సంఘం నాయకులు తుర్రం రాజు, తుర్రం రవికుమార్, కంగాల అభిరామ్, సోడి రాజేష్, కొమరం రాజు, కోరం వెంకటేశ్వర్లు, కొమరం శ్రీరాములు, కాకా నర్సింహారావు, కోరం ప్రశాంత్, కోరం రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంతకాల సేకరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

భద్రాచలంటౌన్: న్యాయవాదుల సమస్యల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం భద్రాచలం కోర్టులో న్యాయవాదుల నుంచి సంతకాల సేకరణతో పాటు పలు డిమాండ్స్‌తో కూడిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎల్‌యు జిల్లా అధ్యక్షుడు ఎంవీ.ప్రసాదరావు మాట్లాడుతూ.. హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు జారీ చేయాలని, కార్డులు పొందినవారి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. వైద్య ఖర్చుల బీమా సౌకర్యాన్ని రు.10 లక్షలకు పెంచి, న్యాయవాదుల తల్లిదండ్రులకు హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని కోరారు. బందారు అరుణ్ చందు, పాయం రవివర్మ, ఉప్పుతోళ్ల గౌతంకుమార్, రేపూరి జయరాజ్, కాపుల ప్రకాష్, తిరుమలరావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

లేబర్ కమిషనర్‌ను కలిసిన వేజ్ బోర్డు ప్రతినిధులు


రాష్ట్ర లేబర్ కమిషనర్ దాన కిషోర్‌ను కలిసిన వేజ్ బోర్డు చైర్మన్, సభ్యులు

బూర్గంపాడు: రాష్ట్ర లేబర్ కమిషనర్‌గా నియమితులైన దాన కిషోర్‌ను స్టేట్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, సభ్యులు యారం పిచ్చిరెడ్డిలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కనీస వేతనాల పెంపుపై కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేజ్ బోర్డు సభ్యులు నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజు ముదిరాజ్‌లు ఉన్నారు.

గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్‌ను..

గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్‌ను భద్రాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు యడమకంటి రోశిరెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. భద్రాచలం రామయ్య ప్రసాదాలను, పట్టు వస్త్రాలు అందించారు.

రేగా ధన్యవాదాలు

మణుగూరురూరల్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పాల్గొని విజయవంతం చేసిన జిల్లా, పినపాక నియోజకవర్గంలోని మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం సోషల్ మీడియా వేదికగా ధన్యవాదాలు తెలిపారు. అధికారంలో లేకపోయిన కేసీఆర్‌పై అభిమానానికి సభకు హాజరైన ప్రజలే నిదర్శనమన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ములకలపల్లి: పోడు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. పోడుకు పట్టాలిచ్చిన ప్రభుత్వం విద్యుత్ లైన్లు, వ్యవసాయ బోర్లు, మోటార్లు కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు ఆరోపించారు. జిల్లాకమిటీ సభ్యుడు మడకం సతీష్, శోభన్, సున్నం కృష్ణ, కోండ్రు వెంకటేష్, తెల్లం నాగేష్, సోయం రవి, శ్యామల, కాంతయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి ఫ్రీజర్ వితరణ


ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ వలీ హాజరత్

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెంకు చెందిన వ్యాపారి అల్లి ఉమామహేశ్వరావు.. కుమారుడు తరుణ్‌కుమార్ జ్ఞాపకార్థం దహన సంస్కారాల సమయంలో మృతదేహాలను భద్రపరచేందుకు ఫ్రీజర్ వితరణ చేశారు. సుమారు రూ.80 వేల విలువ చేసే ఈ ఫ్రీజర్‌ను స్థానిక గ్రామ పంచాయతీకి అందజేయగా దానిని ఎంపీపీ వలీ హాజరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం సహకార సంఘం అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసవర్మ, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, అల్లి సత్యనారాయణ, అల్లి విద్యాసార్, ఎం.సూర్యనారాయణరాజు, ఎడారి శ్రీనివాసరావు, వై.సాంబశివరావు, జి.నాగరాజు, నల్లపు అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా సోమవారం పలుచోట్ల నిరసనలు మిన్నంటాయి. కొన్ని ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించగా.. మరికొన్నిచోట్ల వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికోసం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబాలను సానుభూతి ప్రకటించారు. దాడులు చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంటౌన్: నివాళి అర్పిస్తున్న సీఐ, అసోసియేషన్ సభ్యులు


మణుగూరురూరల్: మౌనం పాటిస్తున్న న్యాయవాదులు


మణుగూరుటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పాత్రికేయులు, స్థానికులు


దమ్మపేట: ఉగ్రదాడిపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు


మణుగూరురూరల్: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు